సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 17 । జనవరి । 2025




అత్తారింట విందు... భలే పసందు

సంక్రాంతి పండగకు కొత్త అల్లుళ్లలకు వందలాది వంటకాలతో భారీ విందు ఇవ్వడం ఇటీవల ట్రెండ్‌గా మారింది. 8లో

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!

8లో

మీకే జంతువంటే ఇష్టం..! తెల్లపులి...ఏనుగు...సింహం ...జిరాఫీ....ఖడ్గమృగం...చింపాంజీ...లేళ్లు... ! ఏదైనా సరే వన్యప్రాణులంటే ప్రేమ చూపేవారు వాటి సంరక్షణ పట్ల ఎంతో మక్కువ చూపుతారు. ఎంత ప్రేమ ఉన్నా వన్యప్రాణులను మనం పెంచుకోలేం...కానీ వాటి సంరక్షణకు ఇతోధికంగా సహాయపడవచ్చు. జూలో జంతువులను దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, లేదా సంవత్సరం పాటు వాటికి ఆహారం అందించడానికి ఎందరో జంతు ప్రేమికులు బాధ్యతగా తీసుకుని ఆర్థికంగా సహాయపడుతున్నారు. మీకూ ఆసక్తిగా ఉందా...



న్యూస్‌రీల్

చర్లపల్లి-విశాఖ-భువనేశ్వర్ ప్రత్యేక రైలు

విశాఖ విద్య: సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం- చెర్లపల్లి- భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు(08549/08550) నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. రైలు నంబర్ 08549 విశాఖపట్నంలో ఈ నెల 18న సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరుతుంది. రాత్రి 8.18 గంటలకు దువ్వాడ చేరుకుని, 8.20 గంటలకు అక్కడ నుంచి బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. రైలు నంబర్ 08550 ఈ నెల 19న ఉదయం 9 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి సాయంత్రం 6.40 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. దువ్వాడలో 6.45 గంటలకు బయలుదేరి రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయలుదేరి ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.

గిరిజన మ్యూజియంకు రూ.6.8 లక్షల ఆదాయం

అరకులోయ టౌన్: గిరిజన మ్యూజియంకు ఈ ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజుల్లో ఎంట్రీ టికెట్ల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేశ, విదేశాల నుంచి విశాఖ-కిరండూల్ ప్యాసింజర్ రైలుతోపాటు సొంత వాహనాల్లో అరకు అందాలు తిలకించేందుకు భారీగా రావడంతో ఇంత ఆదాయం సమకూరిందని నిర్వహకులు తెలిపారు. పండగ మూడు రోజుల పాటు ఎంట్రీ టికెట్ల ద్వారా మొత్తం రూ.6 లక్షల 80 వేలకు పైగా ఆదాయం సమకూరినట్లు మ్యూజియం ఇన్‌చార్జి మణి కుమార్, గిరిజన మ్యూజియం ప్రొటోకాల్ ఇన్‌చార్జి గణపతి తెలిపారు.

పేట భూములపై కన్ను!



ప్రభుత్వం కళ్లు పాయకరావుపేట మండలంపై పడ్డాయి. పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు ఈ మండలంలో 8 వేల ఎకరాల సేకరణకు రంగం సిద్ధమవుతోంది. ఏపీఐఐసీ మధ్యవర్తిత్వం వహించి నేరుగా రైతుల నుంచి కారుచౌకగా కొనుగోలు చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భూసేకరణ కొరకు పాయకరావుపేట మండలంలో తీర ప్రాంతంలో ఐదు గ్రామాలను గుర్తించారు. ఇప్పటికే ఏపీఐఐసీ వారు లేఅవుట్‌కూడా సిద్ధం చేశారన్న సమాచారం మండలంలో వ్యాపించడంతో మత్స్యకారులు, బడుగు బలహీన వర్గాలు, తీరప్రాంత గ్రామాల్లో నివసిస్తున్న పేదల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

నక్కపల్లి :

పరిశ్రమల కోసం భూసేకరణకు 4(1) నోటిఫికేషన్ విడుదల చేయకుండా నేరుగా రైతులతో బేరసారాలు సాగించి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం మొగ్గు చూపిస్తోంది. భూసేకరణ జరిపితే 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు మార్కెట్ విలువ కంటే మూడు రెట్లు అధికంగా చెల్లించాలి. దీనికి తోడు ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీ, పునరావాసం కల్పించి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలి. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు ప్రత్యేక ప్యాకేజీ వర్తింపజేయాలి. ఇవన్నీ చేయాలంటే సాధ్యం కాని పని. ఈ ప్రక్రియలో భూసేకరణ జరిపితే రైతుకు రూ.1.50 కోట్లు పైనే చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని డైరెక్ట్ పర్చేజింగ్ పేరుతో రైతులతో మాట్లాడుకుని డీ ఫారం భూములకు ఎకరా రూ.25 లక్షలు, జిరాయితీ భూములకు రూ.50 లక్షలు చెల్లించనున్నట్లు సమాచారం. ఇప్పటికే నక్కపల్లి మండలం పెద బోదిగల్లంలో సేకరిస్తున్న భూములకు ఇదే ఫార్ములా పాటిస్తున్నారు. నేరుగా రైతుల నుంచి ఎకరా రూ.30 లక్షలు చెల్లించి ఏపీఐఐసీ పేరున రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నారు. పాయకరావుపేట మండలంలో ప్రతిపాదిత గ్రామాల్లో భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో రూ.60 లక్షల నుంచి కోటి రూపాయల పైబడే ఉన్నాయి.

మండలంలో ఐదు గ్రామాలు గుర్తింపు..

పాయకరావుపేట మండలంలో భూముల కోసం తీరప్రాంతం వెంబడి ఇప్పటికే ఐదు గ్రామాలను ఏపీఐఐసీ వారు గుర్తించారు. పెంటకోటలో 1280 ఎకరాలు, రాజవరంలో 1117 ఎకరాలు, కేశవరంలో 712ఎకరాలు, ఈదటంలో 1951 ఎకరాలు, కందిపూడిలో 188 ఎకరాలు, కుమారపురంలో 1882 ఎకరాలు, మాసయ్యపేటలో 206 ఎకరాలు.. మొత్తం 8386 ఎకరాలు ప్రాజెక్టు కోసం గుర్తించారు. ఇప్పటికే రాజవరం, కేశవరం గ్రామాల్లో సుమారు 260 ఎకరాల్లో డక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ ఏర్పాటు చేశారు. పెంటకోట సమీపంలో టౌన్ షిప్ ఏర్పాటు కోసం 452 ఎకరాలను సైతం గుర్తించినట్టు సమాచారం.ఇవేకాకుండా శ్రీరాంపురంలో కూడా మరో 1046 ఎకరాలు సేకరించే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా 8386 ఎకరాలకు సంబంధించి ఏపీఐఐసీ వారు లేఅవుట్ సిద్ధం చేశారు. త్వరలోనే ఈ గ్రామాల రైతులతో మాట్లాడి నేరుగా కొనుగోళ్లు ప్రారంభించనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ వారు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా 4500 ఎకరాలు భూములు సేకరించారు. వీటిలో 2200 ఎకరాలను రూ.1877 కోట్ల వ్యయంతో నిర్మించే బల్క్ డ్రగ్ పార్క్‌కోసం కేటాయించారు. ఈ పార్క్ నిర్మాణానికి ఇటీవలే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. అలాగే ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఆసక్తి చూపిస్తున్నారు. తీరప్రాంతానికి దగ్గరగా ఉన్న రాజయ్యపేటలో 2400 ఎకరాలు భూములు కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. మొదటి విడతలో రూ.70 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. రెండో విడతలో మరో 3600 ఎకరాల్లో రూ.80 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. నక్కపల్లి మండలంలో ఒకేసారి బల్క్ డ్రగ్‌పార్క్, స్టీల్‌ప్లాంట్‌కు భూములు కేటాయించడం కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం పాయకరావుపేట మండలంలో కూడా భూములు సేకరించేందుకు సిద్ధపడినట్టు సమాచారం. తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఈ ఐదు గ్రామాల్లో భూములను గుర్తించి లేఅవుట్ సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే ఏపీఐఐసీ ముందడుగు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.





పాయకరావుపేట మండలం తీరప్రాంత గ్రామాల్లో భూసేకరణ కోసం ఏపీఐఐసీ తయారు చేసిన లేఅవుట్

మత్స్యకారుల నుంచి వ్యతిరేకత

పాయకరావుపేట మండలంలో భూసేకరణకు ప్రతిపాదిత గ్రామాల్లో అధికంగా మత్స్యకారులే జీవిస్తున్నారు. వేటనే ప్రధానంగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. పరిశ్రమల పేరుతో తమ గ్రామాల్లో భూములు లాక్కొంటే మేమెక్కడికి వెళ్లి బతకాలంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. నోటిఫికేషన్ విడుదల చేస్తే 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాల్సి వస్తుందన్న సాకుతో ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి డైరెక్ట్ పర్చేజ్ పేరుతో భూములు కారు చౌకగా లాక్కొవాలని చూస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి నేరుగా కంపెనీల నుంచే కొనుగోలు చేయించాలనే ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా భూ సేకరణ తగదు



పాయకరావుపేట మండలంలో తీరప్రాంత గ్రామాల్లో భూములు సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న సమాచారం వచ్చింది. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా భూములు సేకరించడం తగదు. రైతులైతే ప్రభుత్వం ఇచ్చిన నష్ట పరిహారంతో వేరొక చోట భూములు కొనుక్కుంటారు. మత్స్యకారులు చేతివృత్తులవారు ఎక్కడకెళ్లి జీవనోపాధి పొందాలి. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు లేవు. పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఇప్పటికే నక్కపల్లి మండలంలో భూములు ఇచ్చిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి భూసేకరణ సమయంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ఉన్న ఫళంగా గ్రామాలను ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఈ మండలంలో కూడా ఇదే పరిస్థితి ఎదురు కాబోతోంది. మేమంతా తీవ్రంగా వ్యతిరేకిస్తాం.

–చోడిపల్లి శ్రీనివాస్, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

కానిస్టేబుల్ వెనుక ఏసీపీ?

కలెక్షన్లన్నీ కానిస్టేబుల్ ద్వారానే..



- ఆయన అకౌంటు ద్వారా కోట్లలో లావాదేవీలు?
- అనకాపల్లి నుంచి సిటీకి పోస్టింగులోనూ ఏసీపీదే కీలకపాత్ర
- కూటమి ఎమ్మెల్యేల వ్యవహారంపై ఇప్పటికే ఫిర్యాదులు
- బెట్టింగ్ ముఠా పట్టుబడిన సమయంలో దొరికిన నగదుపైనా విచారణ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో సస్పెండైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) కానిస్టేబుల్ పల్లా గంగరాజు వ్యవహారం వెనుక ఓ ఏసీపీ ఉన్నట్టు చర్చ జరుగుతోంది. సదరు ఏసీపీ ద్వారానే వ్యవహారాలన్నీ ఈ కానిస్టేబుల్ చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా కూటమి ఎమ్మెల్యేల పాత్రపైనా ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చినట్టు సమాచారం. ప్రధానంగా అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేకు బంధువు, పీఏగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తికి ఉన్న లింకులపైనా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మొన్నటి వరకు అనకాపల్లిలో విధులు నిర్వహించిన ఈ కానిస్టేబుల్.. ఏసీపీ ద్వారానే బదిలీ చేసుకుని విశాఖ సిటీకి వచ్చినట్టు సమాచారం. మొత్తంగా క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కానిస్టేబుల్ సెల్ నంబరు ద్వారా జరిపిన లావాదేవీలన్నీ గుర్తించే పనిలో పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు. అంతేకాకుండా కేవలం కానిస్టేబుల్ అకౌంటు ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కానిస్టేబుల్ ద్వారా నిరంతరాయంగా సంభాషిస్తూ.. ప్రతి నెలా మామూళ్లు దండుకుంటున్న ఓ ఎమ్మెల్యేతో పాటు మరో ఎమ్మెల్యే పీఏ వ్యవహారం కూడా త్వరలో బయటపడే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సమయంలోనూ సదరు ఏసీపీ ఈ కానిస్టేబుల్‌కు తన వద్దనే పోస్టింగ్ ఇప్పించుకున్నారు. అప్పటి నుంచి వీరి బంధం రోజురోజుకీ బలపడినట్టు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సమయంలో ఎక్కడెక్కడ ఎంత మొత్తం వసూలు చేయాలి? తనకు ఎక్కడ ఇవ్వాలనే వివరాలన్నీ సదరు ఏసీపీ డైరెక్షన్‌లోనే పనిచేసేవారని పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. స్పాలు మొదలుకుని, బ్లాక్ ఆయిల్ దందా, పేకాట డెన్ నిర్వాహకులతో పాటు గంజాయి బ్యాచ్ నుంచి కూడా వసూళ్లకు తెగబడినట్టు విమర్శలున్నాయి. ఈ విధంగా వసూలు చేసిన మొత్తాన్ని ఏసీపీకి అందజేయడంలో కీలకపాత్ర ఈ కానిస్టేబుల్ పోషించారనే తెలుస్తోంది. వీరిద్దరి డిపార్టుమెంట్లు వేరువేరుగా ఉన్నప్పటికీ..ఆర్థిక బంధం మాత్రం యథావిధిగా కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. తాజా వ్యవహారంలో కూడా ఏసీపీ పాత్రపైనా 'గట్టి' విచారణ జరపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం పోలీసుశాఖలో వినిపిస్తోంది.

నెల నెలా మామూళ్లు...!

స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌తో అవినాభావ సంబంధం ఉన్న కూటమిలోని ఓ ఎమ్మెల్యేకు నెల నెలా మామూళ్లు ముడుతున్నాయని కూడా తెలుస్తోంది. క్రికెట్ బెట్టింగ్ ముఠా నుంచి మామూళ్లు అందజేయడంలో ఈ కానిస్టేబుల్ కీలకపాత్ర పోషించినట్టు సమాచారం. మరోవైపు తెలుగుదేశం పార్టీకి చెందిన మరో కీలక ఎమ్మెల్యే పీఏనని చెప్పుకునే దూరపు బంధువు పాత్ర కూడా కీలకంగా ఉంది. వాస్తవానికి క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్న తర్వాత టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఫోన్ చేసి బెదిరించిన వ్యవహారంలో ఈ పీఏ వ్యవహారశైలిపై కూడా సీపీ సీరియస్‌గా ఉన్నట్టు పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంపై 'చిట్టి'గా కాకుండా 'గట్టి'గా విచారణ జరిపితే దొంగలందరూ బయటకు వస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సెల్ ఫోన్ లింకులపై సీపీ దృష్టి



వాస్తవానికి స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) కానిస్టేబుల్ ఫోన్ నంబరును పరిశీలిస్తే మరిన్ని లింకులు బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సదరు కానిస్టేబుల్ అకౌంట్ ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. డిపార్టుమెంటులో ప్రస్తుతం పనిచేస్తున్న పలువురు పోలీసులకు కూడా తన ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారని సమాచారం. తాజాగా టాస్క్‌ఫోర్స్‌లోని కొంత మందికి కూడా క్రికెట్ బెట్టింగ్ ముఠాలోని సభ్యుల నుంచి ఫోన్ పే ద్వారా నగదు బదిలీ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపైనా విచారణ జరిపితే మరింత మంది డిపార్టుమెంటు దొంగలు బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు క్రికెట్ బెట్టింగ్ ముఠాలో కీలక పాత్ర పోషిస్తున్న లగుడు రవిని పట్టుకున్న సమయంలో కూడా భారీగానే నగదు దొరికిందనే ప్రచారం జరుగుతోంది. దీనిపైనా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్టు సమాచారం. ఈ నగదును చూపకుండా తప్పించిన వ్యవహారం ఇప్పుడు పోలీసుశాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

జాతరలో చల్ చల్ గుర్రం!

చోడవరం : జిల్లాలో క్రీడా స్ఫూర్తితో నిర్వహించే గుర్రాల పరుగు పోటీలు సంక్రాంతి తీర్థాల్లో ప్రత్యేక ఆకర్షణ. గ్రామదేవతల పండగల వరకు అన్ని ఉత్సవాలు గుర్రాల జాతరను తలపిస్తాయి. కొందరు పోటీల కోసమే గుర్రాల పెంపకం చేపడుతుండడం విశేషం. జైపూర్ మహారాణి పాలనలో మాడుగులలో దసరా రోజున ప్రత్యేకంగా గుర్రాల సంత కూడా జరిగేది. ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు వెళ్లేందుకు మైదాన గిరిజన గ్రామాలకు చెందిన వారు నేటికీ గుర్రాలనే రవాణాకు ఉపయోగిస్తున్నారు. దీంతో మైదాన గిరిజన గ్రామాల్లో వీటి పెంపకం పెరిగింది. ప్రస్తుతం సంక్రాంతి తీర్థాలు కనుమ పండగ నుంచి ప్రారంభం కావడంతో గ్రామీణ తీర్థాల్లో గుర్రాల దౌడు మొదలైంది.

మైదానాలు రెడీ

చోడవరం, కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, రావికమతం, మాడుగుల, అచ్యుతాపురం, పాయకరావుపేట, నర్సీపట్నం, కోటవురట్ల, రాంబిల్లితోపాటు రాజరిక కీర్తిని సంతరించుకున్న పద్మనాభం, ఎస్.కోట, భీమిలి, ఆనందపురం ప్రాంతాల్లో గుర్రాల పరుగు పోటీలు జోరుగా నిర్వహిస్తున్నారు. సాధారణంగా మేలు రకం గుర్రాల ధర రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ ఉంటుంది. ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్, హైదరాబాద్, జైపూర్, కటక్ ప్రాంతాల నుంచి మేలు రకం గుర్రాలను కొనుగోలు చేసి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.



గుర్రపు స్వారీపై శిక్షణ పొందుతున్న యువకులు



టైమింగ్ కోసం శిక్షణ ఇస్తున్న గుర్రం

రేసులు...ఇలా...

గుర్రాల పోటీలను మూడు రకాలుగా నిర్వహిస్తారు. పోటీకి వచ్చిన గుర్రాల సంఖ్యను బట్టి రెండు మూడు గ్రూపులుగా విభజించి ఒకేసారి 5 నుంచి 7 గుర్రాలను బరిలోకి దించి స్వారీ చేస్తారు. ముందుగా గమ్యం చేరిన గుర్రాలను వరుసగా గెలుపొందినట్టుగా ప్రకటిస్తారు. రెండో రకం పోటీలో రెండేసి గుర్రాలను బరిలోకి దించి దౌడు తీయిస్తారు. గెలుపొందిన వాటికి మరలా పోటీ పెట్టి తుది విజేతలను ప్రకటిస్తారు. ఇక మూడో రకం పోటీల్లో ఒక్కో గుర్రాన్ని దౌడు తీయించి తక్కువ సమయంలో నిర్దేశించిన గమ్యాన్ని చేరిన గుర్రం గెలిచినట్టుగా ప్రకటిస్తారు. ఎక్కువ మైదానం ఉన్న చోట మొదటి రకం పందాలు నిర్వహిస్తుండగా, ఇపుడు తక్కువ స్థలంలో నిర్వహించాల్సి రావడంతో టైమింగ్ పందాలే ఎక్కువగా జరుగుతున్నాయి.

నేటి నుంచి పోటీలు

ఈనెల 17వ తేదీ జిల్లాలో అతి పెద్ద పండగైన చోడవరం మండలం నర్సాపురం తీర్థ మహోత్సవం, బుచ్చెయ్యపేట మండలం రాజాం, ఆనందపురం గ్రామాల్లో పండగలు సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగుల పోటీని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఈనెల 18న భోగాపురంలోను, 20న శీమునాపల్లి గ్రామాల్లో జరిగే గ్రామ దేవతల పండగల సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.



ఎన్నో బహుమతులు కొట్టాను...



సంక్రాంతి తీర్థాలు వచ్చాయంటే పరుగుల పోటీ కోసం నా గుర్రాన్ని ముందుగానే సిద్ధం చేస్తాను. మంచి ఆహారం పెట్టడంతో పాటు పరుగులో కూడా శిక్షణ ఇస్తాను. గత రెండేళ్లల్లో తూర్పుగోదావరి జిల్లా తుని, సామర్లకోటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో నా గుర్రం మొదటి స్థానం సాధించింది. రుద్ర రైడర్ పేరుతో నా గుర్రాన్ని పోటీకి దించుతాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో మొత్తం 150 గుర్రాల వరకు వివిధ జిల్లాల నుంచి పాల్గొంటాయి. అతి తక్కువ సమయంలో 3.11.6 నిమిషాల్లో 4 కిలోమీటర్ల మేర పరుగుపెట్టి అన్ని గుర్రాల కంటే ముందుగా నా గుర్రం లక్ష్యాన్ని చేరుకుంది. ఈ ఏడాది కూడా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో నా గుర్రాన్ని పరుగుల పోటీకి దించాలని సిద్ధం చేశాను.

–దాడి కోటేశ్వరరావు, గుర్రపు రౌతు, రాయపురాజుపేట

భలే మజా..



గుర్రపు స్వారీలో ఉండే ఆనందమే వేరు. పోటీలో పాల్గొనే గుర్రాలకు మంచి దానా పెట్టాల్సి ఉంటుంది. మేలు జాతి గుర్రాలైతే రూ.2, 3 లక్షలు వరకు ధర ఉంటుంది. ఇటువంటి గుర్రంపై స్వారీ చేస్తే ఆ మజానే వేరేగా ఉంటుంది. నేను సుమారు రూ1.30 లక్షలు పెట్టి గుర్రాన్ని కొన్నాను. అనేక సార్లు పోటీల్లో పాల్గొని చాలా బహుమతులు కూడా కొట్టాను. పోటీల్లో గుర్రంపై దౌడుతీస్తుంటే ఆ జోష్ చాలా బాగుంటుంది.

– రాజేష్, గుర్రం పెంపకందారు, గోపాలపట్నం

అదిగో పులి!

- రాంబిల్లిలో వదంతులు
- సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలు వైరల్



రాంబిల్లి నేవీ కాలనీ గుడి వద్ద పులిగా భావిస్తున్న జంతువు

రాంబిల్లి యలమంచిలి) : మండలంలోని నేవీ కాలనీ శివారు నిర్మాణంలో ఉన్న ఆలయానికి సమీపంలో పులి సంచరిస్తున్నట్టు గురువారం వదంతులు తలెత్తాయి. గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కొందరు స్థానికులు అటువైపుగా వెళుతుండగా దూరంలో పులిలాంటి జంతువును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు యువకులు గుడి పక్క కూర్చుని ఉన్న జంతువుకి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పులి సంచరిస్తున్నట్టు పోస్ట్ చేశారు. ఈ వీడియో భాగా స్థానికంగా వైరల్ కావడంతో అందరూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. పులి సంచరిస్తున్న సమాచారంపై యలమంచిలి అటవీశాఖ బీట్ అధికారి వెంకటరమణను సంప్రదించగా అది పులికాకపోవచ్చునని, ఒక వేళ పులి సంచరిస్తున్నట్టయితే ఆహారం కోసం ఏదో ఒక జంతువును వేటాడుతుందన్నారు. శుక్రవారం నేవీ కాలనీ ప్రాంతాన్ని పరిశీలించి స్పష్టతనిస్తానన్నారు. దీనిపై రాంబిల్లి పోలీసులు కూడా తమను సంప్రదించారని ఆయన సాక్షికి ఫోన్‌లో తెలిపారు.

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!





తెల్ల పులులు



నీటి ఏనుగు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పాటు అందించడానికి దాతలు ముందుకు వస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను జూ అధికారులు దత్తత ఇస్తున్నారు. ఇందుకు దాతలు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దాతల పేరుతో జూ సిబ్బంది వాటికి ఆహారం



చింపాంజీ

అందిస్తారు. జూలో ఏ జంతువు, ఏ పక్షిని దత్తత తీసుకొంటే వాటి ఎన్‌క్లోజరు వద్ద వాటి ఫొటోతో పాటు దాతల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అవి సందర్శకులకు స్పష్టంగా కనిపించే విధంగా ఎన్‌క్లోజరు వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పలువురు దాతల పేర్లతో కూడిన బోర్డులను వారు దత్తత తీసుకొన్న వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సిద్ధం చేశారు.


ఆకర్షణీయంగా దాతల పేర్లతో బోర్డులు

జూ పార్కులో వివిధ జాతులకు చెందిన జంతువులు, రకరకాల పక్షులు, తాబేళ్లు, మొసళ్లు, పాములు జూకి వెళుతున్న సందర్శకులను అలరిస్తుంటాయి. ఆయా ఎన్‌క్లోజర్ల వద్ద దాతల బోర్డులు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయి. జూలో వందల కొలది వన్యప్రాణులు, పక్షులు ఉన్నాయి. వాటిపై ప్రేమ, వాత్సల్యం చూపుతూ జూ అధికారులకు సహకరిస్తున్నారు. వాటిని దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి ఆహారం అందించడానికి బాధ్యతగా తీసుకొని సహాయపడుతున్నారు. ఇక్కడ తెల్ల పులి, ఖడ్గమృగం, జిరాఫీ తదితర పెద్ద జంతువులను పలు కంపెనీలు ఏడాది పాటు దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చాయి. మరికొన్ని చిన్న జంతువులు, పక్షులను కూడా కొందరు నెల, ఆరు నెలలు పాటు దత్తత తీసుకొని ఆహారం అందిస్తున్నారు.

- ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ జిరాఫీని ఒక ఏడాది పాటు దత్తత తీసుకొంది. దీంతో ఆ కంపెనీ పేరు, జిరాఫీ చిత్రపటంతో దాని ఎన్‌క్లోజరు వద్ద బోర్డు ఏర్పాటు చేశారు..
- ఎన్‌క్లోజరు వద్ద ఐటీసీఎల్ కంపెనీ ఖడ్గమృగాన్ని ఏడాది కాలం దత్తత తీసుకొన్నారు. దాన్ని మళ్లీ మరో ఏడాది దత్తత కొనసాగించడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. ఖడ్గమృగం ఉన్న చిత్రపటంపై లిమిటెడ్ పేరుతో బోర్డును దాని ఎన్‌క్లోజరు వద్ద ఏర్పాటు చేశారు.
- ఆర్సిలోర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎన్/ఎంఎస్) తెల్ల పులిని ఒక సంవత్సరం పాటు దత్తత తీసుకొంది. తెల్లపులుల ఎన్‌క్లోజరు వద్ద ఆ కంపెనీ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.
- వీటితో పాటు మరికొందరు ఏడాది, ఆరు నెలలు, మూడు నెలలు, నెల, ఒక్కరోజు కూడా ఇక్కడ వన్యప్రాణులకు ఆహారం అందించడానికి దత్తత తీసుకొన్నవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.



కనుజులు




ఏనుగులు

ఆహారం ఇలా...

సింహం, పులికి పశు మాంసం, చికెన్ **ఆహారంగా వేస్తున్నా**రు. ఏనుగుకు రాగి సం**గటి, చెరకు,** గ్రాసం, అరటి దవ్వ, బెల్లం, **కొబ్బరి కాయలు** అందిస్తున్నారు. చింపాం**జీలకు పళ్లు, కాయ**లు, పాలు ఆహారంగా **వేస్తారు. జింకలు,** కణుజులు, కొండ గొర్రెలు తదితర వాటికి గ్రాసం వేస్తారు. అన్ని పక్షులకు పలు రకాల పళ్ల ముక్కలు కోసి వేస్తారు. కోతులకు పళ్లు, వేరుశెనగ పిక్కలు వేస్తారు. నీటి ఏనుగుకు పళ్లు, కూరగాయలు, ఆకు కూరలు వేస్తారు. ఇలా ఇక్కడ వన్యప్రాణులన్నింటికీ వాటి ఆహారం కోసం రోజుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఆదాయం పన్ను మినహాయింపు..

ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి వ్యక్తులు, సంఘాలు, పరిశ్రమలు వారి శక్తి మేరకు సహకారం అందించవచ్చు. ఏనుగు నుంచి చిన్న పక్షి వరకు ఎవరైనా ఎంత కాలానికైనా దత్తత తీసుకోవచ్చు. వాటి కోసం ఒక రోజు, నెల, ఏడాది వారిగా అయ్యే ఖర్చు చెల్లించవచ్చు. జూలో వన్యప్రాణులను దత్తత తీసుకొన్నవారికి ఆదాయం పన్నులో మినహాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ దత్తత పద్ధతి 2011లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలువురు దాతలు ముందుకొచ్చి ఇక్కడ పులులు, సింహాలు, ఏనుగులు, పక్షులకు ఆహారం అందిస్తున్నారు.



ఆస్ట్రిచ్



జీబ్రా

దాతలు ముందుకు రావాలి

జూలో వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలి. వాటికి ఆహారం అందించడంలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే కొందరు దాతలు సంస్థల పరంగా, వ్యక్తిగతంగా ముందుకు వచ్చి కొన్ని జంతువులను, పక్షులను వారం, నెల, ఏడాది కాలానికి ఆహారం అందించడానికి వన్యప్రాణులను దత్తత తీసుకొన్నారు. ఎక్కువ మంది దాతలు స్పందించి ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే మూగజీవాలకు సహకరించినవారవుతారు. దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

\- జి.మంగమ్మ, జూ క్యూరేటర్

ఎంత మొత్తం చెల్లించాలంటే..

జంతువు / పక్షి దత్తతకు చెల్లించాల్సిన మొత్తం

జంతువు/ పక్షి	రోజుకు	ఏడాదికి
ఏనుగు	రూ.1200	రూ.4,30,000
ఖడ్గమృగం	రూ.820	రూ.3,00,000
నీటి ఏనుగు	రూ.600	రూ. 2,00,000
సింహం	రూ.600	రూ.1,90,000
పెద్ద పులి	రూ.600	రూ.1,90,000
జిరాఫీ	రూ.500	రూ.1,80,000
చిరుత పులి	రూ.400	రూ.1,25,000
ఎలుగుబంటి	రూ.300	రూ.1,10,000
చింపాంజీ	రూ.210	రూ.75,000
అడవి దున్న	రూ.200	రూ.73,000
జీబ్రా రెండింటికి	రూ.330	రూ.60,000 (ఒక జీబ్రాకు)
తోడేళ్లు రెండింటికి	రూ.300	రూ.55,000 (ఒక తోడేలుకు)
రేచుకుక్క	రూ.135	రూ.50,000
చుక్కల దుప్పి	రూ.100	రూ.36,500
రింగ్‌టైల్డ్ లెమూర్‌కు	రూ.100	రూ.36,500

ఇవి కాకుండా...

మొసలి/ఘరియల్ రెండింటికి రోజుకు	రూ.150	రూ.24,000 (ఏడాదికి ఒకదానికి)
హంసలు (రెండింటికి 2 రోజులకు)	రూ.100	రూ.18,000 (ఒక హంస)
నక్షత్ర తాబేళ్లు (పదింటికి ఐదు రోజులకు)	రూ.150	రూ.11,000
సారస్ కొంగ/నిప్పుకోడి/ పాములు (నాలుగు రోజులకు)	రూ.100	రూ.10,000 (ఒకదానికి)
గుడ్లగూబలు (నాలుగింటికి ఒకరోజుకు)	రూ.100	రూ.9,500 (ఒక దానికి)
మకావ్‌లు (నాలుగింటికి మూడు రోజులకు)	రూ.100	రూ.3,000 (ఒక దానికి)
పీజియన్/నెమళ్లు (నాలుగింటికి నాలుగు రోజులకు)	రూ.100	రూ.2,200 (ఒక దానికి)
ఆఫ్రికన్ చిలుకలు/రామచిలుకలు (ఐదు రోజులకు)	రూ.100	రూ.1500 (ఒకదానికి)
లవ్ బర్డ్స్ (పదింటికి ఐదు రోజులకు)	రూ.100	రూ.1,000 (ఒకదానికి)

క్లుప్తంగా

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత తురువోలు



విజేతకు నగదు బహుమతులను అందజేస్తున్న స్థానిక పెద్దలు, యూత్

దేవరాపల్లి: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా తురువోలు నిలిచింది. మండలంలోని తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఈ పోటీలు అర్ధరాత్రి వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 30 జట్లు పాల్గొనగా, హోరాహోరీగా సాగాయి. ప్రథమ స్థానంలో తురువోలు, ద్వితీయ స్థానంలో పెదగంట్యాడ, తృతీయ స్థానంలో తారువ, నాల్గో స్థానంలో వావిలపాడు జట్లు నిలిచాయి. వీటికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.4 వేల చొప్పున బహుమతులను గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు, క్రీడా అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



ఎస్.రాయవరం : మండలంలోని రేవుపోలవరం తీరంలో గల్లంతైన కాకర్ల మణికంఠ(22) మృతదేహం గురువారం నక్కపల్లి మండలం చిన తీనార్ల తీరం సమీపంలో లభ్యమైంది. ఎస్‌ఐ విభీషణ రావు వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా ప్రతిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మణికంఠ తుని మండలం లోవ కొత్తూరులో తన మేనమామ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రేవుపోలవరం తీరానికి వచ్చి గల్లంతైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తీరంలో మునిగిన సాత్విక్‌ను మణికంఠ కాపాడబోయి కెరటానికి కొట్టుకుపోయాడు. ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చిత్తశుద్ధితో రహదారి భద్రతా చర్యలు

- అధికారులకు జేసీ జాహ్నవి ఆదేశం
- జాతీయ భద్రతా మాసోత్సవాలు ప్రారంభం
- పోస్టర్, కరపత్రాలను విడుదల చేసి జేసీ



జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 పోస్టర్లను విడుదల చేస్తున్న జేసి ఎం.జాహ్నవి, జిల్లా రవాణా అధికారి మనోహర్, అధికారులు

తుమ్మపాల : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా, చిత్తశుద్ధితో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రవాణా, పోలీసు శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించి మాసోత్సవాలు-2025 పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు చాలా ముఖ్యమైనవన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సురక్షిత డ్రైవింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రహదారి భద్రత కార్యక్రమాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శుక్రవారం నుంచి రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్పెక్టర్స్, రిటైర్డ్ ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందితో వలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు.

రేపటి నుంచి స్పెషల్ డ్రైవ్

ఈనెల 18 నుంచి 21వ వరకు మద్యం సేవించి వాహనం నడిపే వారిని గుర్తించడం, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్‌తో గుర్తించడం, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జేసీ తెలిపారు. ఈనెల 22 నుంచి 23వ వరకు జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి అక్కడ తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

అవగాహన కార్యక్రమాలు

ఈనెల 24న డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27 తేదీలలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి వాకథాన్‌లు నిర్వహించడం, 30, 31వ తేదీలలో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని జేసీ తెలిపారు. కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి. మనోహర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎం.వెంకట నారాయణ, మోటార్ వెహికల్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా, పోలీస్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్తారింట విందు... భలే పసందు

- కొత్త అల్లుళ్లకు 78 వంటకాలతో భోజనం

మునగపాక : గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారు. ఎక్కడో తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొత్త అల్లుళ్ల కోసం అత్తవారు పలు రకాల పిండివంటలతో విందు భోజనం ఏర్పాటు చేయడం అనవాయితీగా వస్తుంది. ఇదే సంప్రదాయం ఇపుడు ఉమ్మడి విశాఖ జిల్లాకు పాకుతుంది. గవర్ల అనకాపల్లిలో బ్రాంచి పోస్టుమాస్టర్ పాలమరశెట్టి జగ్గారావు ఇంటిలో సంక్రాంతి సందడి కనిపించింది. జగ్గారావు-అన్నపూర్ణ దంపతుల కుమార్తె జిషితను అనకాపల్లికి చెందిన చదరం చిన నూకరాజు-ప్రభావతి దంపతుల కుమారుడు వంశీతో వివాహం చేశారు. ఈ దంపతులకు 78 రకాల పిండివంటలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. అలాగే మునగపాకకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెలగా సూర్యనారాయణ ద్వితీయ కుమారుడు అర్మీ రిటైర్డ్ ఉద్యోగి జగన్నాథరావు-గీత కుమారుడు సూర్యతేజకు గవర్ల అనకాపల్లికి చెందిన పాలమరశెట్టి చందు-వరలక్ష్మి దంపతుల కుమార్తె జ్యోష్ణకు వివాహం జరిగింది. కొత్త జంట కావడంతో అత్తమామలు వారికి 78 రకాల పిండివంటలతో తయారు చేసిన వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. ఇరు దంపతులు అత్తవారింట జరిగిన మర్యాదల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నోరూరించే వంటకాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని అల్లుళ్లు సూర్యతేజ, వంశీలు హర్షం వ్యక్తం చేశారు.

చిన్నబాబు కాలనీలో 120 వంటకాలతో...

అనకాపల్లి : అనకాపల్లి మండలం చిన్నబాబు కాలనీకి చెందిన వేగి విశ్వేశ్వరరావు శారదా దంపతుల కుమార్తె వర్ధినికి వివాహం జరిగింది. మొదటి సంక్రాంతికి రావడంతో కుమార్తె వర్ధిని అల్లుడు ఆదారి భరత్‌వాజ్‌లకు 120 రకాల పిండివంటకాలతో విందును ఏర్పాటు చేశారు. పసందైన విందుతో కొత్త అల్లుడికి స్వాగతం పలికారు. చుట్టుపక్కల ప్రజలు ఈ కొత్త సంప్రదాయాన్ని ఆసక్తిగా తిలకించారు.



మండలంలో చిన్నబాబు కాలనీలో కొత్త అల్లుడు ఆదారి భరత్‌వాజ్, వర్ధినికి విందును ఏర్పాటు చేసిన వేగి విశ్వేశ్వరరావు దంపతులు

క్వారీ గుప్పెట్లో రాజన్నపేట!

- సమస్యలు విన్నవించుకున్నా పట్టని అధికారులు, పాలకులు
- వైఎస్సార్‌సీపీ మండల మహిళా నాయకురాలు శివాలక్ష్మి ధ్వజం



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం (ఫైల్)

రోలుగుంట : మండలంలో ప్రజలకు ఇబ్బందికరంగా నడుస్తున్న నల్ల రాతి క్వారీ గుప్పెట్లో రాజన్నపేట గ్రామస్తుల పరిస్థితి దినదిన గండంగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల మహిళా నాయకురాలు కిమిడి శివాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజన్నపేట గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లరాతి క్వారీ చెరువును పూడ్చి క్వారీ రోడ్డు నిర్మాణం చేసుకున్నారని, అర్హత లేని సిబ్బందితో బ్లాస్టింగ్ చేస్తున్నారని తెలిపారు. బ్లాస్టింగ్‌లతో రాళ్లు పంట పొలాల్లో పడుతుండడంతో పశువులు బెదిరి పారిపోతున్నాయని తెలిపారు. బ్లాస్టింగ్‌ల అదురుకు సమీపంలో గల రాజన్నపేట గ్రామానికి చెందిన పలువురి ఇళ్ల గోడలు దెబ్బ తిన్నాయని తెలిపారు. పరిమితికి మించి బండరాళ్ల భారీ లోడుతో జరుగుతున్న రవాణా కారణంగా రోడ్లు గుంతలు పడుతున్నాయని, కాలుష్యంతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. జలవనరులు కూడా ఇంకిపోతున్నాయని అన్నారు. ఇటీవలే మండలానికి వచ్చిన చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి, అలాగే ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజుకు కూడా ఈ సమస్యపై వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. వీటిపై అధికారులు, పాలకులు దృష్టి సారించి బాధిత గ్రామాలను సందర్శించి ప్రజాభిప్రాయ సేకరణ చేసి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే బాధిత గ్రామాల ప్రజలు, వామ పక్షాలతో కలసి అందోళనకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఆదుకుంటాడనుకుంటే.. అసువులు బాసాడు

- జలపాతంలో మునిగి యువకుడి మృతి
- ఎన్.జి.నగరంలో తీర్థం పూట విషాదం
- ఉద్యోగంలో చేరి రెండు నెలలు కూడా గడవక ముందే మృత్యువాత
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



శ్యాంప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, (ఇన్‌సెట్) మృతుడు వంటాకు శ్యాంప్రసాద్ (ఫైల్)

దేవరాపల్లి: మండలంలోని ఎన్.గజపతినగరంలో గ్రామ దేవత తీర్థం పూట పెను విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన యువకుడు వంటాకు శ్యాంప్రసాద్ (21) పాడేరు మండలం ఐనాడ పంచాయతీ గుల్లి గిరిజన గ్రామ సమీపంలోని జలపాతంలో బుధవారం ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. గురువారం జరగాల్సిన గ్రామ దేవత తీర్థానికి దూరమయ్యారు. ఈ కుటుంబం జీవనోపాధి నిమిత్తం విశాఖలో ఉంటున్నారు. స్వగ్రామంలో ఉన్నప్పుడు ఈ కుటుంబ సభ్యులు, శ్యాంప్రసాద్ గ్రామ దేవత నారితల్లమ్మకు దీపారాధన చేసేవారు. అమ్మవారి తీర్థం కోసం మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన శ్యాంప్రసాద్ అదే రోజున మృతి చెందడాన్ని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికి సంబంధించి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి శ్యాంప్రసాద్ మంగళవారం జలపాతం సందర్శనకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జలపాతంలో మునిగి మృతి చెందాడు. శ్యాంప్రసాద్ అంత్యక్రియలు గురువారం ఎన్.జి.నగరంలో జరిగాయి.

ఉద్యోగంలో చేరి రెండు నెలలు గడవక ముందే..

డిగ్రీ చదివిన నిరుపేద కుటుంబానికి చెందిన శ్యాంప్రసాద్ రెండు నెలల క్రితమే ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు.

విశాఖలోని పట్టాభిరామ్ గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న ఇతని తండ్రి శ్రీధర్ జీవీఎంసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. భర్తతో పాటు కుమారుడి జీతం కూడా కలిసి వస్తుందని, ఇక తమ కష్టాలు తీరుతాయని శ్రీధర్ భార్య లక్ష్మి ఎంతో ఆనందించింది.

ఉద్యోగంలో చేరి రెండు నెలలు కూడా గడవక ముందే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు పలువురి కంటతడి పెట్టించింది.

కన్నీటిపర్యంతమైన తండ్రి..

ఎన్.గజపతినగరం గ్రామానికి చెందిన శ్రీధర్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో దివ్యాంగుడైన ఓ కొడుకు ఇటీవలే మృతి చెందాడు. ఆ బాధ నుండి ఇంకా తేరుకోక ముందే ఎదిగి వచ్చిన కొడుకు జలపాతంలో మునిగి చనిపోవడంతో గుండెలు పగిలేలా రోదించిన తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కొడుకులు ఇద్దరు మృతి చెందారని, తాము ఎవరి కోసం బ్రతకాలని, కన్న కొడుకు చితికి తలకొరివి పెడతానని కలలో కూడా ఊహించలేదని, ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదని తండ్రి కన్నీంటి పర్యంతమయ్యారు.

క్లుప్తంగా

సుందరయ్యపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్‌గా కృష్ణ



తుమ్మపాల: సుందరయ్యపేట గ్రామంలో గురువారం అబ్దుల్ కలాం విజ్ఞాన కేంద్రం(గ్రంథాలయం) నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. గ్రంథాలయ చైర్మన్‌గా వియ్యపు కృష్ణ, కార్యదర్శిగా బాదపు సింహాచలం, కార్యవర్గ సభ్యులుగా పొడుగు కాంతారావు, చొప్ప అప్పలనాయుడు, బాదపు సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వ్యవస్థాపక చైర్మన్ బోయిన చిన్నారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ బాదపు తాతారావు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి బొట్టా రామకృష్ణ, లెక్చరర్ బోయిన వెంకటరమణ గ్రామపెద్దలు బాదపు రమణ, గ్రామ వైస్ ప్రెసిడెంట్ బాదపు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–2 సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు, జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డి–2 సెక్షన్ ఏఈ జి.వై.రవికుమార్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాంధీ మార్కెట్ ఫీడర్ పరిధిలో సాగినుబ్బరాజు వీధి, గౌరీసంఘం వీధి, సతకంపట్టు ఏరియా, దిబ్బవీధి, రైతు సంఘం వీధి, గంగిరేగిచెట్టు ఏరియా, అరుంధతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

- 32 కేవీ సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా మండలంలో తుమ్మపాల విద్యుత్ శాఖ పరిధిలో తుమ్మపాల, అల్లిఖానుడువానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ కశింకోట ఏఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటల పాటు వ్యవసాయానికి కూడా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వారపు సంతలో కూరగాయల ధరలు

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కొండెక్కాయి. కిలో వంకాయ, చిక్కుడు కాయ, పచ్చి బఠాణీ కాయలు, బీరకాయ, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. బెండకాయ, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు, చేమదుంప రూ.60, ఉల్లిపాయ, పెండ్లం దుంప రూ.40, బంగాళాదుంప రూ.30, టమాటా రూ.20 పలికారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 6,421 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,900	5,290
రెండో రకం	3,600	4,640
మూడోరకం	3,150	3,300

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప–2	: సత్యనారాయణ స్క్రీన్–1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్–2
గేమ్ ఛేంజర్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
డాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–6 యూనిట్లు , బీ పాజిటివ్–26 యూనిట్లు, ఓ పాజిటివ్–34 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 211 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

మురుగులో పల్లెలు.!

- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- రహదారులపై నిలిచిపోతున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



కుంచంగి గ్రామంలో దుస్థితి



అనకాపల్లి: మురుగు పోయే మార్గం లేక పల్లెలు కంపుకొడుతున్నాయి. అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఎక్కడికక్కడ రహదారులపై మురుగు నిలిచిపోతోంది. సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చిన ప్రజలు క్షీణించిన పారిశుధ్యంతో నానా అవస్థలు పడ్డారు. మండలంలో 32 పంచాయతీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకుండాపోయింది. సైడు కాలువలు లేకపోవడంతో వాడుక నీరు సైతం ప్రవాహానికి అవకాశం లేకుండాపోయింది. దుర్వాసన రావడంతో ముక్కు మూసుకుని జీవించే పరిస్థితి ఏర్పడింది.

క్షీణించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. రోడ్లపై నిలిచిన మురుగు దోమలకు ఆవాసంగా మారింది. మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, ఎన్టీఆర్ కాలనీ, వెంకటరమణపేట, శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, బవులవాడ, తుమ్మపాల, కుంచంగి, తదితర ప్రాంతాల ప్రజలు డ్రైనేజీ సమస్యతో నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. దీంతో దోమల వ్యాప్తి ఎక్కువైంది. రాత్రి వేళ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

మరోవైపు దోమల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేటలో రహదారిపై నిలిచిన మురుగు

వ్యాధుల బారిన పడుతున్నాం..



కుంచంగి గ్రామం ప్రారంభ దశలోనే డ్రైనేజీ వ్యవస్థ కనిపిస్తుంది. తరువాత కాలువలు లేవు. దీంతో వాడుకనీరు రహదారులపై ప్రవహిస్తోంది. పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశాం. ఫలితం లేదు. సమస్యపై సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇవ్వనున్నాం. దోమల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది.

– బాలాజీ, కుంచంగి గ్రామం, అనకాపల్లి మండలం

దుర్వాసనతో బాధపడుతున్నాం..



గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాం. ఆరు మాసాలుగా గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం లేదు. చిన్నారులు, వృద్ధులు దోమకాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నారు. తక్షణం కాలువలు నిర్మించాలి.

– లక్ష్మణరావు, కుంచంగి గ్రామం, అనకాపల్లి మండలం

'సంక్రాంతిలో జూదందే పైచేయి'

అనకాపల్లి: పాడి పంటలు, భోగిమంటలు నడుమ జరగాల్సిన ఆనందాల సంక్రాంతి పండగను కూటమి ప్రభుత్వం కోడి పందేలు, పేకాట శిబిరాల పండగగా మార్చేసిందని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కోడి పందేల నివారణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బహిరంగ బెట్టింగ్ కంట్రోల్ చేయవలసిన అధికార యంత్రాంగం చేతులెత్తేసిందన్నారు. సంక్రాంతి పండగలో వేల కోట్ల రూపాయలు చేతులు మారడం బాధాకరమని, ఇటువంటి సంఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఆయన కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 15వ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలో 24 శాఖల అధికారులు పాల్గొంటారని, మండల పరిధిలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండలంలో పలు అభివృద్ధి పనులపై చర్చించనున్నామన్నారు.

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'



పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్న వెదురుపర్తి హైస్కూల్ హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో సంక్రాంతి సెలవుల్లో టెన్త్ విద్యార్థుల చదువు తీరుపై అక్కడి హైస్కూల్ హెచ్‌ఎం ఎ.వి.ఎస్.మూర్తి దృష్టి సారించారు. 'విద్యార్థి మేలుకో' కార్యక్రమంలో భాగంగా గురువారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వారికి పాఠ్యాంశాల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు చదువు ప్రణాళికాబద్ధంగా సాగేలా శ్రద్ధ వహించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ సతీష్‌కుమార్

తుమ్మపాల: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పద్మావతి అన్నారు. గురువారం పట్టణంలో ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాన్ని ఆమెతో పాటు పట్టణ ఎస్‌ఐ సతీష్‌కుమార్ ప్రారంభించారు. రహదారి భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన విధానాలు, మెలకువలను డిపో డ్రైవర్లు కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి వివరించారు. ప్రమాద రహిత డ్రైవింగ్ ఈ రోడ్డు భద్రత మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

పండగెళ్లిపోయినా జీతభత్యాల్లేవు...



గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో రెండో రోజు ఆందోళన చేస్తున్న ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు

చోడవరం : జీత భత్యాలు పాత బకాయిలు చెల్లించాలని కోరుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పరిష్కరించలేదంటూ ఫ్యాక్టరీ ఆవరణంలో గురువారం కార్మికులంతా విధులను నిలిపివేసి గేటు బయట ఆందోళన చేశారు.

సంక్రాంతిలోగా కార్మికులకు రావలసిన పాత బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఎందుకు చెల్లించలేదని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు ప్రశ్నించారు. కార్మికులకు ఇవ్వాల్సిన ఓటీల డబ్బులు ఇవ్వలేదని, గతేడాది నుంచి డీఏలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. సంక్రాంతి పండగ అయిపోయినా నేటికీ జీతభత్యాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు.

వైభవంగా దండు ముత్యాలమ్మ తీర్థం



గొండుపాలెంలో దండు ముత్యాలమ్మ అమ్మవారికి పూజలను చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామ దేవత దండుముత్యాలమ్మ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి తీర్థం సందర్భంగా గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. అమ్మవారికి పసుపుకుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలైన గుర్రపు యజమానులకు నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందించారు.

సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలి



ఆర్టీసీ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు ప్రముఖ భూమికి పోషించాలని డీఎం ఎం.ఎస్.ఎస్.ధీరజ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్యారేజ్‌లో డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ భూభాగంలో ఇద్దరు వ్యక్తులు ముఖ్యమన్నారు. ఒకరు తన ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి రక్షణ కల్పించే సైనికుడు కాగా, రెండో వ్యక్తి ప్రయాణికుల భద్రతకు భరోసా ఇచ్చే డ్రైవర్ అన్నారు. ఆర్టీసీలో ప్రయాణిస్తే భద్రత ఉంటుందని ప్రయాణికుల నమ్మకం అన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు ప్రమాదాలకు తావులేకుండా సేవలు అందించాలన్నారు. ఆర్టీసీ ప్రమాదాల సంఖ్య చాలా తక్కువ అన్నారు. జీరో యాక్సిడెంట్ నమోదుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. అనంతరం టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్ ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ పి.ఆచారి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

19న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

- భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



కాంతులీనుతున్న వినాయకుని సెట్టింగ్

యలమంచిలి రూరల్:

ఉమ్మడి విశాఖ జిల్లాలో పేరొందిన యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఈ నెల 19న నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా మార్గశిర మాసోత్సవాల అనంతరం సంక్రాంతి తర్వాత అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరను తిలకించడానికి సుమారు 50వేల నుంచి లక్ష మంది తరలివస్తుంటారు.

రద్దీకి తగినట్టుగా ఉత్సవ కమిటీతో పాటు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లలో భాగంగా ఇప్పటికే యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి, అమ్మవారి ఆలయం, ఆలయానికి వెళ్లే అంతర్గత రహదారులన్నీ భారీ విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆయా ప్రాంతాలు కాంతులీనుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన రాధాకృష్ణులు, కనకదుర్గమ్మ, వినాయకుని సహా వివిధ దేవతా మూర్తుల సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి.

జాతర కోసం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జెయింట్ వీల్, రంగులరాట్నం, భారీ ఎత్తున స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేయడానికి ఉత్సవ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ తెలిపారు.

అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఆనందంగా సాగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో 2005–06 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకోవడంతోపాటు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో 150 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బకాయిపడ్డ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం, కలెక్టర్ చొరవ తీసుకుని కార్మికులకు నాలుగు నెలలుగా బకాయిపడిన రూ.6కోట్లను విడుదల చేయాలన్నారు. కర్మాగారంలో పర్మినెంట్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఓచర్ పేమెంట్ కార్మికులు సుమారు 352 మందికి జీతాలు లేక సంక్రాంతికి అల్లాడిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బకాయిలు చెల్లించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కర్మాగారం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

25న గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం జరుగుతుందన్నారు. 37 స్టేజ్ ప్రోగ్రాంలు, వివిధ రకాలైన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోల్‌కతా లైటింగ్, భారీ బాణసంచా, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు, సహాయ కార్యదర్శి పి.వి.రమణ, సభ్యులు పీలా నాగశ్రీను, కొణతాల మాధవ, దాడి బుజ్జి, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, భీశెట్టి ప్రసన్న, పెంటకోట లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: యువత సన్మార్గంలో నడవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సూచించారు. మునగపాక దళితవాడలో బుధవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, దళిత నాయకులు డొక్కా నాగభూషణం, కోనపల్లి రామ్మోహనరావు, బీలా లక్ష్మణరావు, కరణం గణేష్, అనిల్‌కుమార్, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన దంపతులకు సత్కారం



గొల్లలపాలెంలో 60 ఏళ్లు దాటిన దంపతులను సత్కరిస్తున్న శ్రీ వెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని గొల్లలపాలెంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం రాత్రి 60 సంవత్సరాలు దాటిన 20 మంది దంపతులను సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులపై చిన్నచూపు లేకుండా వారికి అండగా నిలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా నేత శీరా రమణమ్మ, గీతా ప్రచార సమితి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఆక్రమణలో గౌరమ్మ చెరువు'

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామం వద్ద జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న నీటిపారుదల శాఖకు చెందిన గౌరమ్మ చెరువు ఆక్రమణకు గురవుతుందని, దీని నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతు బుద్ధ వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. గౌరమ్మ చెరువులో సుమారు రెండు ఎకరాలు ఆక్రమించి గొబ్బూరుపాలెంలో ఉన్న ఓ సిమెంట్ పరిశ్రమకు సర్వీసు రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు. సాగునీటి కాలువకు కూడా నష్టం కలిగించారని, దీనివల్ల ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. గతంలో కూడా కిత్తయ్య చెరువు, సాగునీటి కాలువను కూడా ఆక్రమించారని విమర్శించారు. వీటిని పరిశీలించి ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకొని రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని కోరారు.